


# చిట్టచివరి అంచు!

మేడమీది తన గదిలోకి వెళ్లబోతూ ఒక్కసారి వంటింటి వంక చూసేడు గోపాలం.

వంటింట్లో గుడ్డిదీపం వెలుగుతున్నా చీకటిగానే ఉంది. ఆ గదిలో పగటిపూటకూడా దీపం అవసరమే. కాని గోపాలంవంటి గుమాస్తాకి పగటిదీపాలు బొత్తిగా శక్తికి మించినవి. భవిష్యత్తులోకూడా తను అటువంటి అదృష్టానికీ, అర్హతకీ నోచుకోడని ఆ గొర్రెతోక గుమాస్తాకి అవగతమైపోయిన చేదునిజం.

కళ్లు పెద్దవిచేసి చూసేడు గోపాలం.

వంటింటి దృశ్యం స్పష్టంగానే కనిపిస్తూంది.

పిల్లలిద్దరి కంచాలూ రెండేసి కూరలతో, అన్నపు కెరళ్లతో నిండుగా ఉన్నాయి. వాటిపక్క ఆకు దొన్నెలలో పులుసో, పాయసమో మాత్రం స్పష్టంగా తెలియడం లేదు.

సాధారణంగా గోపాలం ఆకలి నిద్రాణంగా ఉంటుంది, కోరలు తీయబడి గారడీవాడి మేదరిబుట్టలో బంధించబడిన నాగుపాములోని పౌరుషంలా. బయటపడినా ఫలం దక్కదని గోపాలం ఆకలి కేనాడో తెలిసిపోయింది. అసంతృప్తికి చాలా అలవాటు పడిపోయిం దా గుమాస్తా ఆకలి. కాని. . .

ఈ క్షణాలలో మాత్రం పడగ విప్పింది గోపాలం ఆకలి. నిండుగా కనిపిస్తున్న కంచాలను చూస్తూ బుసలు కొట్టింది.

"త్వరగా తినెయ్యాలి." రాధ హెచ్చరిస్తూంది పిల్లలిద్దరినీ.

ఆత్రంగా ముద్దలు నోట కుక్కుకుంటున్నారు పిల్లలు.

మెట్లెక్కబోయిన గోపాలాన్ని ఆకలి ఆపివేసింది.

అప్పటికి ఆరున్నర దాటి ఆట్టేసేపు కానిమాట నిజమే. కాని ఉదయం తొమ్మిదిన్నరకు తిన్న పచ్చడి మెతుకులూ, తాగిన మజ్జిగనీళ్లూ ఎంతసేపు పట్టి ఉంచగలవు, అన్నం తిన్నామని ఆత్మవంచన చేసుకుందుకు తప్ప? ఆ తిండి మనిషికెందుకూ చాలదు. ఆరిపోయే దీపాన్ని ఎగసెన తొయ్యడంవల్ల ఎంత లాభమో, ఆ తిండివల్ల గోపాలానికీ అంతే! అయితే అతను కొన్ని సంవత్సరాలుగా ఆత్మవంచన కలవాటు పడిపోయాడు. తొమ్మిదిన్నరకు పచ్చడిమెతుకులు కొరికి, మజ్జిగనీళ్లు తాగి పది నుంచి అయిదు వరకూ ఆఫీసులో అడ్డమైన చాకిరీ చేసి, అప్పుడు అయ్యరుపాకలో అర ( హాఫ్ ) టీ తాగి ఎనిమిది వరకూ రోడ్లంట తిరిగి ఇల్లు చేరుకోడం గోపాలం రొటీన్. బెల్లంతో చేసిన టీ అని గోపాలానికి తెలియక కాదు. ఆరు పైసలకి పంచదార టీ దొరకదని ఆ గుమాస్తాకి తెలుసు. అంతకంటే ఎక్కువ మూల్యం చెల్లించలేని తన అసమర్థతే కారణమని గోపాలానికి తెలుసు.

కారణం రాధ. పిల్లల పెళ్ళి బ్రతుకులు తెల్లవార్చి అని తన తపన. కాని ... ఎవరు గుర్తించారు? తనపట్ల కనీసపు కృతజ్ఞత అయినా లేదు రాధలో. శ్వాసం లేదు.

పిల్లలకూ రాధకూ పసందైన భోజనం. వాళ్ల కోసం అష్టకష్టాలూ పడుతున్న తన కేమో చాలీచాలని చారూ మెతుకులూ. ఎక్కడి న్యాయమిది? ఎటువంటి న్యాయం? ఎన్నాళ్ల నించి ఇలా మోసం చేస్తూందో రాధ!

హృదయంలేని వీళ్లను, విశ్వాసంలేని వీళ్లను ఎందుకు పోషించాలి తను, తన కోరికలను చంపుకుని? ఆకాశాన్నంటే ధరలలో, ఎవరి జీవితం గడవడం వారికే కష్టంగా అవుతున్న ఈ రోజులలో తను రాధ కోసం, పిల్లల కోసం ఎందుకు వృథా శ్రమపడాలి? తన కడుపు కొట్టి వాళ్లు హాయిగా బలుస్తూంటే ఏమీ చేతకాని అసమర్థుడిలా ఎందుకు ఊరుకోవాలి తను? ఈ అన్యాయం ఎందుకు భరించాలి?

రాధని పిల్లలనీ బయటకు తరిమేస్తే . . .? ఏం చేస్తారేం? అనాథులమనీ, తన కెవరూ లేరనీ చెప్పుకుంటూ హోటళ్ల ముందర అడుక్కుంటూ, పేవ్‌మెంట్ల పక్కన కాలం గడుపుతుందా రాధ? విశ్వాసం లేని మనిషి—తన బ్రతుకు రచ్చకీడ్చినా ఈడవ గలదు. మహాఅయితే పోయేది పరువు. పోనియ్. సుఖం లేని జీవితానికి పరువుండి ఏం లాభం?

రాధనీ పిల్లలనీ తరిమేస్తే తను అనాటిలా సుఖంగా జీవించగలడు. అప్పుడు చాలా సమస్యలుండవు. సుఖాలుంటాయి. అప్పుడు వంటిల్లు అనవసరం. అద్దె తగ్గుతుంది. డాక్టరు బిల్లులుండవు. చాలా సుఖపడవచ్చు ఒంటరిగా.

అవును. రాధనీ పిల్లలనీ బయటకు పంపేస్తాడు తను. అంతే. వాళ్ల జీవితా లేమైనా తన కనవసరం. గతంలో వాళ్ల కోసం తను మూర్ఖంగా చేసిన వ్యర్థ త్యాగాలు చాలు. ఇప్పటికయినా కళ్ళు విప్పి నిజం గ్రహించడం వివేకం. తను విధించబోయేది శిక్షే అయితే, రాధవంటి స్వార్థపరురాలి కది తక్కువే తప్ప ఎక్కువ కాదు.

ఈ గాదెకింది పందికొక్కులను వదుల్చుకోవాలి. పచ్చని ఆకువంటి తన జీవితానికి పట్టిన గొంగళీలను విదుల్చుకోవాలి. అదే తన కర్తవ్యం.

ఆకలితోపాటు ఆవేశంకూడా అవధులు మీరింది గోపాలంలో.

రేపు పొద్దుటినించీ ఆరంభించబోయే సౌఖ్యపూరిత స్వేచ్ఛాజీవితం గురించి ఆలోచిస్తూ చివరిసారిగా తన నిశ్చయాన్ని దృఢపరచుకుని మెట్లు దిగాడు. మెల్లగా వంటింటిలోకి నడిచాడు.

కడుపు చెక్కలయ్యేలా తిన్నారేమో పిల్లలిద్దరూ కంచాలవద్దే పడి దొర్లుతున్నారు.

వారికి దగ్గిరలో కూర్చుని కన్నీరు పెట్టుకుంటూంది రాధ.

మనసులో నిర్ణయించుకోవడానికీ, దాన్ని అమలు జరపడానికీ మధ్య కల తారతమ్యంలోని కష్టాన్ని గుర్తిస్తున్నట్లు రెండు క్షణాలు మౌనంగా నిలబడి పోయి పిలిచాడు గోపాలం: "రా. . . ధా. . ."

హఠాత్తుగా తల ఎత్తి వడివడిగా అనేసిం దామె: "చాలా నెలల నుంచి పిల్లలకి రాత్రివేళ గంజి మాత్రమే ఇస్తున్నాను. ఇవాళే నా బుద్ధి వక్రించింది ఎదురింటి మేడవారు బట్ట పడిందేమో అన్న అనుమానంతో కూరలూ, పులుసూ పారబోయబోతూంటే. . . ఫరవాలేదని తెచ్చాను. ముందు నేను రుచి చూసేను. నా నోటి కే విషమూ అనిపించలేదు. అందుకని పిల్లలకి పెట్టాను. వాళ్ళు అన్నం తినీ తినకనే. . ." ఇక విడలే దామె గొంతు.

"ఇంత ఘోరం జరిగితే నాకు చెప్పలేదేం?"



ధర్మం శరణం గచ్ఛామి                    చిత్రం— డి. వి. ప్రసాద్ (గుంటూరు-4)

"నెలాఖరు రోజులు. డాక్టర్ని పిలుచుకు వచ్చేందుకు నీ దగ్గిర రిక్షాఖర్చికూడా లేదని తెలుసు. అందుకనే పిల్లలు పడిపోయినా చెప్పలేకపోయాను. నీకా కూరలూ అవీ వెయ్యనిది. అందుకే..." అన్నేళ్ల జీవితంలోనూ ఆమె తమ్ముడితో అన్ని మాట లనడం అదే మొదటి సారి. భర్త పోయి, ఇద్దరు పిల్లలను వెంట నిడుకుని అనాథగా వచ్చిన తన నాదరించిన గోపాలం అంటే ఆమె కపరిమితమైన కృతజ్ఞతాభావం. మాట్లాడటానికే భయం. అతను తమ జీవితాలకు ఆలంబనమని పూర్తిగా తెలును. అందుకే గోపాలం ప్రాణంతో ప్రయోగం చెయ్యలేకపోయిం దా కూరలు వేసి. ఇదంతా వివరంగా చెప్పలేకుం దామె అతనికి.

కన్నీరు తుడుచుకుని, "తమ్ముడూ!" అంటూ పిలిచింది కంఠం కంపిస్తూండగా.

గుడ్డిదీపం గాలికి రెపరెపలాడుతూంది.

వంటిల్లంతా ఎర్రని కాంతితో భయంకరంగా ఉంది.

పిల్లలు మరగలు కక్కుకుంటున్నారు.

గోపాలం అక్కడ లేడు. ★